ప్రజాశక్తి

బుధవారం 11 జూన్ 2025 5 విజయనగరం

బీచ్ వాలీబాల్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 6,7,8 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ బీచ్ వాలీబాల్ పోటీలలో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. దినేష్ జట్టు ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించి రూ.50వేలు నగదు బహుమతి పొందింది. ఈ సందర్భంగా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, చిన్నారి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా కోశాధికారి సన్యాసినాయుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

క్లస్టర్ ఖాళీలు చూపించాలి

- బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- కౌన్సిలింగ్ కేంద్రం వద్ద ధర్నా
- తొలిరోజు ప్రారంభం కాని కౌన్సిలింగ్ ప్రకియ
- ఉపాధ్యాయుల పడిగాపులు

జెడ్‌పి హాలు వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్లస్టర్ ఉపాధ్యాయ ఖాళీలను ముందే చూపించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలింగ్ హాలు జెడ్‌పి సమావేశ మందిరం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జెడ్‌పి సమావేశ మందిరంలో అధికారులు ఎస్‌జిటిల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే కౌన్సిలింగ్‌లో క్లస్టర్ ఖాళీ పోస్టులు చూపించక పోవడంతో ఉపాధాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విద్యాశాఖ అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఉపాధ్యాయులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న అన్ని ఖాళీలను కోరుకునేందుకు అందరికీ అవకాశం కల్పించాలని, క్లస్టర్ ఖాళీలను ఉపాధ్యాయ సీనియారిటీ 1300 నెంబర్ తర్వాత ఉన్నవారికి చూపిస్తామనడం సరికాదని అన్నారు. కౌన్సిలింగ్ హల్ లోకి ఉపాధ్యాయ సంఘాలు నాయకత్వానికి ప్రవేశం కల్పించాలని కోరారు. ఆర్‌జెడితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని డిఇఒ చెప్పడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులు

తొలిరోజు కౌన్సిలింగ్ వాయిదా

అధికారులు తొలిరోజు 4వందల మందిని కౌన్సిలింగ్‌కు పిలిచారు. రాత్రి 8గంటల వరకు లింకు ఓపెన్ కాకపోవడంతో కౌన్సిలింగ్ ప్రక్రియను బుధవారం ఉదయం 9గంటలకు అధికారులు వాయిదా వేశారు. అంతకుముందు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని చెప్పిన విద్యా శాఖ అధికారులు రాత్రి 8గంటల వరకు లింకు ఓపెన్ కాకపోవడంతో కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించలేదు. దీంతో ఉపాధ్యాయులంతా కౌన్సిలింగ్ కేంద్రం బయట పడిగాపులు కాశారు. చివరకు చేసేది లేక బుధవారం ఉదయం 9గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించడంతో ఉపాధ్యాయులంతా వెనుదిరిగారు.

యోగాతో శ్రమ జీవులు మమేకం

- వేలాది మంది ఉపాధి వేతనదారులతో భారీ ప్రదర్శన
- చిరుజల్లుల మధ్యే యోగాంధ్ర
- ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం-యోగాంధ్ర లక్ష్యం
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

యోగా చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పలుగు, పార పట్టుకొని మట్టిని తవ్వే శ్రమ జీవుల చేతులు యోగా కోసం పైకి లేచాయి. నిత్యం భూమిని నమ్ముకొని కాయకష్టం చేసే ఆ దేహాలు నేలపై కూర్చొని యోగాసనాలతో చైతన్య వంతమయ్యాయి. ఓవైపు చిరుజల్లులు కురుస్తున్నా..మొక్కవోని దీక్షతో వారంతా యోగా ప్రదర్శనను దిగ్విజయంగా పూర్తి చేశారు. వేలాదిమంది ఉపాధిహామీ వేతనదారులు యోగాంధ్ర కార్యక్రమానికి హాజరై యోగాసనాలు వేశారు. ఎస్.కోట మండలం చినఖండేపల్లి గ్రామ పరిధిలోని సాయి దివ్యామృతం ఆశ్రమంలో మంగళవారం ఉదయం ఉపాధి కూలీలతో జిల్లాలో రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వేతనదారులు చిరుజల్లులు కురిసినప్పటికీ, క్రమశిక్షణతో ప్రదర్శనను చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ప్రతీఒక్కరికీ ఆరోగ్యాన్ని అందించాలన్న గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి యోగాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాధించడమే ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. మే 21న ప్రారంభించిన ఈ కార్యక్రమం జూన్ 21తో ముగుస్తుందని చెప్పారు. యోగాతో చక్కని ఆరోగ్యాన్ని సాధించవచ్చునని సూచించారు. యోగాభ్యాసాలు నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎస్.కోట ఎంఎల్ఎ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత మన నిత్య జీవితంలో ప్రతీఒక్కరూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, వీటినుంచి ఉపశమనం పొందేందుకు, శారీక, మానసిక ఆరోగ్యాన్ని సాధించేందుకు యోగా దోహదపడు తుందని చెప్పారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ, శారీక మానసిక ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచేందుకు యోగా దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఎంపిపి ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి, టూరిజం డైరెక్టర్ సుబ్బలక్ష్మి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విశ్రాంత వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు, సాయి దివ్యామృతం ఆశ్రమ బాబా సాయి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా టూరిజం అధికారి కుమారస్వామి, ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, హౌసింగ్ అధికారి మురళీమోహన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేష్, ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జిఎస్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఒకే రోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది లో అన్ని శాఖల ద్వారా పూర్తి చేసిన ప్రాజెక్టులు, పనులు, ఒకే రోజున ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అలాగే అన్ని శాఖల వద్ద మంజూరై ప్రారంభించాల్సిన పనులకు శంకుస్థాపనలు చేయాలని సూచించారు. ఈనెల 12కు ఏడాది పూర్తి చేసుకొని, రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాలకు సిద్ధం అవుతున్న వేళ ఒక రోజు ముందే 11నే జిల్లాల్లో ప్రారంభోత్సవాలు చేపడతామని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల నుండి మొత్తం 428 పనులకు గానూ 92.17 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు కాగా వీటిలో ప్రారంభోత్సవాలకు 290 పనులు, శంకుస్థాపనలకు 138 పనులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పనులకు గానూ నియోజకవర్గం వారీగా సంబంధిత శాసన సభ్యులను సంప్రదించి ప్రారంభోత్సవాలు చేయించాలని, ముందుగానే శిలాఫలకాలు తయారు చేసుకోవాలని తెలిపారు. 11 వ తేదీనే సాయంత్రానికి ఎక్కడెక్కడ ఎన్నెన్ని పనులు ప్రారంభించారో , ఎన్నెన్ని శంకుస్థాపన లు చేసారో నివేదిక నివ్వాలని సూచించారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ , మత్స్య శాఖ, ఆర్.డబ్ల్యు.ఎస్., డ్వామా, సర్వ శిక్షా అభియాన్ , విద్యుత్ శాఖ , మున్సిపల్ కమిషనర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

44 అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న తరుణంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలతో నగరంలో వివిధ ప్రాంతాలలో శంకుస్థాపనలకు శ్రీకారం చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. బుధవారం 44 అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 10.79 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రహదారులు, కాలువలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కెఎల్ పురం రెవెన్యూ కాలనీలో చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, పలువురు పాల్గొంటారని తెలిపారు. మిగిలిన డివిజన్లలో ఆయా కార్పొరేటర్లు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు.

భారీగా బదిలీలు

10మంది జిల్లా అధికారులకు స్థాన చలనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గడిచిన రెండు రోజులుగా జిల్లాలోని ఉద్యోగులు, అధికారుల బదిలీలు భారీగా జరిగాయి. ఇప్పటి వరకు మొత్తం 9మంది జిల్లా అధికారులకు స్థానచలనం కలిగింది. జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి డిపిఆర్ఒ డి.రమేష్‌కు విశాఖపట్నం బదిలీ అయ్యింది. డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి రాష్ట్ర కేంద్రంలోని సెర్ఫ్ డైరెక్టరేట్‌కు, ఉద్యానశాఖ జిల్లా అధికారి జమదాగ్ని, ఎపి ఐఎంఐపి పీడీ లక్ష్మీనారాయణలకు సంబంధిత రాష్ట్ర కేంద్రాలకు వెళ్లనున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి విటి రామారావు, డిపిఒ వెంకటేశ్వరరావు విశాఖపట్నం జిల్లా డ్వామా కార్యాలయ ఎఒగా వెళ్లనున్నారు. సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం అనకాపల్లి జిల్లాకు, ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం ఎన్టీయార్ జిల్లాకు, జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణ కుమారి జివిఎంసికి బదిలీ అయినట్టుగా తెలిసింది. భూగర్భ జలశాఖ డిడి దుర్గాప్రసాద్‌కు కూడా స్థాన చలనం లభించినట్టుగా సమాచారం. వీరి స్థానంలో కొత్త ముఖాలు రానున్నాయి. ఒకేసారి పదిమంది వరకు కొత్తముఖాలు రావడంతో వీరంతా జిల్లా పరిస్థితులను, తమ శాఖల ప్రాధాన్యత, భౌతిక పరిస్థితులను తెలిసుకుని కుదటపడేసరికి కొంత సమయం పట్టనుంది. ఈ ప్రభావం జిల్లా అడ్మినిస్ట్రేషన్‌పై సహజంగానే ఉంటుంది. దాదాపు అన్ని శాఖల్లోనూ 5ఏళ్లు సర్వీస్ దాటిన దిగువ స్థాయి ఉద్యోగులు బదిలీ అయ్యారు. అటవీశాఖలో దశాబ్దాలు తరబడిన ఒకరికీ బదిలీ కాలేదని, ఆ ఉద్యోగి కనుసన్నల్లో చాలా మందికి అక్రమ బదిలీలు జరిగాయని చర్చసాగుతోంది.

ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగవంతం

కోవిడ్ పరీక్షలకు రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆసుపత్రులలో పెండింగ్ ఉన్న సివిల్ పనులు , ఎలక్ట్రికల్ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఎస్.కోట, గజపతినగరం , రాజాం , చీపురుపల్లి ఏరియా ఆసుపత్రులలో పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేసి జూలై నెలాఖరుకు అప్పగించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో వైద్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో పనుల పై సమీక్షించారు. బాడంగి, బొబ్బిలి, నెల్లిమర్ల , భోగాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో కూడా పనులు పెండింగ్ ఉన్నాయని, అవసరాలన్నిటినీ పూర్తి స్థాయి లో త్వరగా పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. చెల్లింపులు పెండింగ్ ఉన్నందున పనులు పూర్తి చేయలేకపోయామని కాంట్రాక్టర్లు తెలుపగా నిధుల కోసం వైద్య శాఖ ముఖ్య కార్యదర్శికి డిఒ లేఖ రాయాలని డిసిహెచ్ఎస్ కు కలెక్టర్ సూచించారు. సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జీవన రాణి, డిసిహెచ్ఎస్ పద్మజారాణి, ఎపిఎస్ఎంఐడిసి ఎస్ఇ విజయ్ భాస్కర్ , ఇఇ ఎం. శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ పరీక్షలకు రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలి

జిల్లాలో కోవిడ్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ప్రస్తుతమ కోవిడ్ పరీక్షల కోసం శాంపిల్స్ ను విశాఖపట్నం పంపుతున్నామని, దీనివల్ల ఆలస్యం అవుతోందని, జిల్లాలోనే రాపిడ్ టెస్ట్ లు చేయడానికి రెండు రోజుల్లో ఎక్విప్మెంట్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

- నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా
- కమిషనర్ కు సమ్మె నోటీసు

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్కాస్, థర్డ్ పార్టీలో ఉన్న మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్‌పిహెచ్ కార్మికులకు జీవో నెంబర్ 36, 16, 15 ప్రకారం వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, జాతీయ, పండగ సెలవులు, 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ రోజు నుంచి సమ్మెలోకి వెళితే ఆ రోజు నుంచి విజయనగరంలో కూడా సమ్మె చేస్తామని కమిషనర్ పి. నలనయ్యకు సమ్మె నోటీస్ అందించారు. అంతకు ముందు ధర్నాలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అండ్ నాన్ పిహెచ్ కార్మికులందర్నీ ఆప్కాస్‌లో చేర్చకపోవడంతో ఒక్కో కార్మికుడు 3 నుంచి 4 లక్షలు రూపాయలు నష్ట పోయారని తెలిపారు. నెల్లిమర్ల, రామ తీర్థాలు, ముసిడిపల్లి పంప్‌హౌస్‌లో 70 మంది, ప్లాంటేషన్‌లో 35 మంది, లీకులు, వాల్ ఆపరేటర్లు 60మంది, స్ట్రీట్ లైట్ విభాగం, ఆఫీస్ సబార్డినేట్స్, డీఈవో లు థర్డ్ పార్టీ లోనే ఉన్నారని తెలిపారు. ఇఎస్ఐ, పిఎఫ్ చట్ట ప్రకారం చెల్లించడం లేదని, పండగ, జాతీయ సెలవు దినాలు, సిక్, క్యాజువల్ లీవులు అమలు కావడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ ఆందోళనలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.రామనాయుడు, ఎస్.రాజు, కె.ఆదినారాయణ, భాస్కర్‌రావు, పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

శాంతి భద్రతల్లో ఘోర వైఫల్యం

- కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు
- వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏడాది కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో రోజుకో అఘాయిత్యం ..గంటకో నేరం చోటుచేసుకోవటం అత్యంత దారుణమని వైసిపి మహిళా విభాగం నాయకులు అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఘోరంగా వైఫల్యం చెందాయని, మహిళలకు రక్షణ కరువైందంటూ మంగళవారం నిరసన తెలిపారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు గదుల సత్యలత ఆధ్వర్యంలో బాలాజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సత్యలత, జిల్లా పార్టీ అర్గనైజింగ్ కార్యదర్శి దుప్పాడ సునీత, కార్పొరేటర్ రేగాన రూపాదేవి, ఎంపిటిసి కెల్ల కృష్ణవేణి మాట్లాడారు. శాంతి భద్రతల నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎంలు పవన్ కళ్యాణ్‌లు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఏడాది కాలంలో సుమారు 1600కు పైగా మహిళలపై వేధింపులు కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతపురంలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలికను అత్యంత దారుణంగా హత్య చేయటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో 9వ తరగతి విద్యార్థినిపై గత ఆరు నెలలుగా అత్యాచారం చేసిన వారు అధికార మదంతో తప్పించుకు తిరుగుతుంటే పట్టించుకున్న వారు కరువయ్యారన్నారు. రాష్ట్రంలో ఏ మూలన ఏం జరిగినా వైసిపి ముద్ర వేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ పబ్బంగడుపు కుంటున్నారని తెలిపారు. కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తప్ప.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయటం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆశపు సుజాత, పిన్నింటి కళావతి, ఆల్తి సత్యకుమారితో పాటు మహిళా విభాగం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబరు నేరాల దర్యాప్తు వేగవంతం

జిల్లా అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత

ప్రజాశక్తి - కంటోన్మెంట్

సైబరు నేరాలను చేధించేందుకు దర్యాప్తు వేగవంతం చేయాలని అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న సైబరు కేసులను అదనపు ఎస్‌పి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబరు నేరాలను చేధించేందుకు దర్యాప్తును వేగవంతం చేయాలని, కేసుల మిస్టరీని చేధించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబరు నేరాలను చేధించేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని దర్యాప్తు అధికారులు మెరుగుపర్చుకోవాలన్నారు. సైబరు నేరాల్లో బాధితులు ఏ తరహాలో మోసపోయింది, ఆయా కేసుల్లో ఇప్పటి వరకు సంబందిత దర్యాప్తు అధికారులు చేపట్టిన దర్యాప్తు, తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సైబరు నేరాలు జరిగిన వెంటనే బాధితులు స్పందించి, సకాలంలో 1930కు ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబరు మోసానికి గురైన తరువాత బాధితుల నగదు ఎవరి బ్యాంకు ఖాతాలకు బదిలీ జరిగింది, ఎక్కడ, ఎవరు ఆయా నగదును విత్ డ్రా చేసింది అన్న వివరాలను సాధ్యమైనంత వేగంగా రాబట్టాలన్నారు. అనంతరం, ఆయా బ్యాంకు ఖాతాల నుండి నిందితులు నగదును విత్ డ్రా చేయకుండా నగదును ఫ్రీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఫ్రీజ్ అయిన నగదు కోర్టు అనుమతితో బాధితుల బ్యాంకు ఖాతాకు జమయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సైబరు మోసాలను నియంత్రించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు వంపే లింకులు,ఈ-మెయిల్స్, క్యూ ఆర్ కోడ్లను క్లిక్ చేయవద్దని, మోసగాళ్ల ప్రలోభాలకు లొంగవద్దని, ఓటిపి లను ఎవరికి షేర్ చేయకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నేరాలకు పాల్పడిన సైబరు మోసగాళ్ళను సాంకేతికత ఆధారంగా గుర్తించి, వారిని త్వరితగతిన అరెస్టు చేయాలన్నారు. సైబరు మోసాలకు గురైన వారు సకాలంలో https://cybercrime.gov.in లేదా 1930 ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి సౌమ్యలత

హోంగార్డు కుటుంబ సంక్షేమానికి కృషి : ఎస్‌పి

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బి.వి.రమణమూర్తికి 'చేయూత"ను అందించేందుకు హోంగార్డు సిబ్బంది పోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,23,050 చెక్ ను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు, అనారోగ్యంతో మరణించిన లేదా ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని పోగు చేసి చేయూతగా అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల ఇన్చార్జి ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లాను పరామర్శించిన ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

టిడిపి విశాఖ జిల్లా ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుమారుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిగజపతిరాజు మంగళవారం పరామర్శించారు. విశాఖలోని ఆయన నివాసానికి వెళ్లిపల్లా సింహాచలం చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జి, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ వర్మ , తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొద్దల నరసింగ రావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు, ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు, తెలుగు మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం వాణిజ్యమండలి (ఛాంబర్ ఆఫ్ కామర్స్) 2025-2027 సంవత్సరాలకు నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. పట్టణంలోని ఉల్లి వీధి లో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం లో ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో ఛాంబర్ అధ్యక్షునిగా కాపుగంటి శ్రీనివాస్ ఎన్నిక అయ్యారు. పూర్వపు అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్యదర్శి గా బొడ్డు శ్రీనివాసరావు, కోశాధికారి గా ప్రవీణకుమార్ ఆంచాలీయా, ఉపాధ్యక్షులుగా ఒబ్బిలిశెట్టి సతీష్ కుమార్, బుడ్డెపు వెంకటరావు, ఎన్.వి.శ్రీనివాస్, పచ్చిగోళ్ల రామారావు, ఆరిశెట్టి శ్రీనివాస్, అరుణ్ సౌధాని, గోగుల శివకుమార్,ఎ.వి. యస్.ఆర్.కె.కుమారస్వామి, గోకవరపు ఉదయ్ ఎన్నిక అయ్యారు. సహకార్యదర్శులుగా బొడ్డు రమేష్, ఆలవెల్లి వెంకట శేఖర్, గుంపిన గోపాలకష్ణ వెంకటేశ్వరరావు, బత్తుల చందు, కె.ఆర్.కె. రాజు, వల్లంపాటి ఉపేంద్రరావు, శివ్వా రాజా, రవ్వాకిరణ్, ఉడత్తు వెంకట రాజేష్ తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఏర్పాటయింది. ఈ నెలలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని నూతన అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్ తెలిపారు.

రూ.50లక్షలు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ షాక్‌తో మరణించిన కార్మికుడు కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మండల నాయకులు జి.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ గ్రోత్ సెంటర్ పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బెర్రీ పరిశ్రమలో విద్యుత్‌షాక్‌తో మరణించిన జార్ఖండ్ కార్మికుడు అన్సారీ కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రత ప్రమాణాలు లేకపోవడంతోనే తరుచు ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించని యజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బ్యాడ్మింటన్ అకాడమీకి ఎంపిక

శృంగవరపు కోట: స్థానిక స్పార్టన్ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కె. అభిషేక్ రాజు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో మంచి ప్రతిభ కనపరిచి స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్, యానాం బాడ్మింటన్ అకాడమీకి ఎంపికయ్యాడని అకాడమీ కోచ్ ప్రసాద్ మళ్ళా తెలిపారు. అభిషేక్ రాజుకి యానాం స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో బాడ్మింటన్ నందు సంవత్సర కాలం పాటు ఉచిత సదుపాయాలతో కోచింగ్ ఇస్తారన్నారు. ప్రతిభ ఆధారంగా శిక్షణ ఇచ్చే కాలం పెరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అకాడమీకి మంచి పేరు తీసుకురావాలని స్పార్టన్ బాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు డి.వి.సూర్యనారాయణ, విజయరామరాజు, బోని ఈశ్వరరావు, కోచ్ రొంగలి మోహన్‌లు ఆకాంక్షించారు.

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

కొత్తవలస: ఇంటర్మీడియట్ ఫలితాల్లో వాగ్దేవి కళాశాల రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా మంగళవారం కొత్తవలసలో విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ తుమ్మికాపల్లి వద్ద వాగ్దేవి కాలేజీ నుంచి కొత్తవలస జంక్షన్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి బోరున పడుతున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జేజేలు కొట్టారు. ఈ ర్యాలీలో కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వర రావు, కళాశాల డైరెక్టర్ సి.హెచ్. ప్రవీణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్స్ ఎం.లక్ష్మణరావు, జి.సతీష్, బి.రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

డెంకాడ: మండలంలోని అక్కివరం గొల్లపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య కోరారు. అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

అధికారులతో సమీక్ష

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించనున్న జాతీయ యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సుమారు 6వేల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి, రవికుమార్, ఎంఇఒ ఎన్.నాగభూషణ రావు, వెలుగు ఎపిఎం సన్యాసిరావు, వేపాడ గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లిమర్ల: సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ సబ్ స్టేషన్ పరిధి ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగింపు, చెట్టు కొమ్మలు తొలగింపు పనులు, సాంకేతిక సమస్యలు పరిష్కరించడానికి ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు.

కరాటేలో విద్యార్థులకు బెల్టులు ప్రదానం

కొత్తవలస: విశాఖపట్నం వేపగుంట గంటల కనకారావు కరాటే అకాడమీలో విన్‌డ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం బెల్టు టెస్ట్ నిర్వహించారు. కొత్తవలస ఒకేనావా స్పోర్ట్స్ అకాడమీ నుండి కె.గౌతమ్ రితిక్, పి.జెస్సికా, ఏ.సాయి సుజన్, ఎల్. అవినాష్, పి. నాగ వెంకట వంశీ, పి. గౌరీ ప్రసన్న, ఎం.దేవ హర్ష ఈ.శ్రీలక్ష్మి ప్రసన్న, ఈ. దేవకి లత, ఎం. గోవర్ధన్‌లకు గ్రీన్, బ్లూ, మెరిన్ బెల్టులు వచ్చాయి. వీరిని కె. సూర్యనూకరాజు అభినందించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి రెండవ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన సుప్రభాత సేవతో స్వామి వారికి మేలుకొ లుపు పాడారు. అనంతరం ధ్వజారోహణం, అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సంతర్పణకు రెండువేల మంది పైగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ రమణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ముమ్మన చంద్రయ్య, రుద్ర వెంకట రమణ, కంపర ఎర్రినాయుడు, రుద్ర సత్యనారా యణ, లక్కోజు సత్యనారాయణ, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

13న విద్వాన్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డి మోహన్ చెప్పారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. 2020 నుంచి 2025 వరకు ఇంటర్, బిఎ, బికామ్, బిఎస్‌సి పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్ మేళాకు అర్హులన్నారు. 200మంది వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అర్హత సర్టిఫికేట్స్, బయోడేటా, రెండు ఫోటోలతో శుక్రవారం ఉదయం 10గంటలకు కళాశాలకు రావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలను సంప్రదించాన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత

నెల్లిమర్ల: స్థానిక మీమ్స్ సమీపంలో ఉన్న శ్రీవివేకానంద ధ్యాన మందిరంలో మంగళవారం విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేసవిలో ఇక్కడ నిర్వహించిన ఉచిత నృత్య తరగతులకు హాజరైన వంద మంది చిన్నారులకు ఎంపిడిఒ రామకృష్ణ రాజు, సేవాసమితి కార్యదర్శి జగన్నాథరాజు సర్టిఫికేట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆట పాటలు కూడా అవసరమని చెప్పారు. ఉచిత శిక్షణ అందించిన సూర్యతేజ డాన్స్ అకాడమీ ప్రతినిధి సౌభాగ్యాలక్ష్మికి సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శంకర్ జగన్నాథం, సేవాసమితి సహ కార్యదర్శి సారిపల్లి త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రాజెక్టుకు షెట్టర్ల వితరణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

రేగిడి: మండలంలోని సంకిలి సాయన్న ఛానల్ రెగ్యులేటర్ తలుపులు విరిగి సాగు నీరు వృథాగా పోతున్న నేపథ్యంలో సాగునీటికి సొంత ఖర్చులు అనే కథనం ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైంది. దీంతో చిన్నపుర్లి గ్రామా నికి చెందిన ఎంపిటిసి కురిటి రామకోటి స్పందించారు. ముందుగా రెగ్యులే టర్‌ను పరిశీలించారు. ఎన్ని తలుపులు అవసరమో గుర్తించారు. రెండు షెట్ట ర్లను తయారు చేయించి ఆయకట్టు రైతులతో తలుపులను వేయించారు. పాలకులు, అధికారులు కూడా స్పందించి సాయన్న ఛానల్ రెగ్యులేటర్ మిగతా తిరుగుడు పూన్, పెద్దపూన్ తలుపులు వేయించాలని రైతులు కోరుతున్నారు. రెగ్యులేటర్లకు తలుపులు వేయడంతో ఆయకట్టు రైతులు రామకోటికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలపై యువత దృష్టి పెట్టాలి

నెల్లిమర్ల: యువత చదువులతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని, ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్లతో కుస్తీలు పడుతున్నారని అలా కాకుండా ప్రతి ఒక్కరూ ఖాళీ సమయాల్లో క్రీడల వైపు మొగ్గు చూపాలని కబడ్డీ రాష్ట్ర అధ్యక్షులు కోరాడ ప్రభావతి అన్నారు. సారిపల్లిలో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ సమ్మర్ క్యాంపు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజు క్రీడాకారులను జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నడిపేన లక్ష్మణరావుతో కలిసి ఆమె పరిచయం చేసుకుని వారి ఆటతీరును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి జైత్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాసరావు రూ.25వేలు విలువ చేసే టీషర్టులను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలను కించపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- రాజాం

రాష్ట్రవ్యాప్తంగా సాక్షి ఛానల్లో మహిళలను అవమానించిన వారిపై ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుత ర్యాలీలు చేస్తే మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, అనుచిత వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం రాజాం పట్టణంలో మహిళలు భారీ ఎత్తున మహిళలపై వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు రాజధానిని, అమరావతి మహిళలను అసభ్యకరంగా దూషించిన కృష్ణంరాజుని, సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, సాక్షి డౌన్ డౌన్ అంటూ మహిళలు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సాక్షి ఛానల్లో

గజపతినగరంలో నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

అమరావతిని, అక్కడి మహిళలను కించపరచడం హేయమైన చర్య అన్ని, నిరసన తెలిపిన మహిళలను సంకరజాతి అని కించపరచడం దారుణమని వాపోయారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రజా సంకల్ప వేదిక మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు గొనా మానస, సభ్యులు రాజధాని మహిళలను అవమానిస్తూ మాట్లాడిన కృష్ణంరాజుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డికు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

అమరావతి మహిళలను కించపరిచిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజును కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్, మహిళా కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఎన్టీఆర్ బొమ్మ వరకు ర్యాలీ చేసి పత్రికను తగులబెట్టారు.

నెల్లిమర్ల: సాక్షి మీడియాలో మహిళల పట్ల దిగజారుడు వ్యాఖ్యలకు నిరసనగా నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో మహిళలు పెద్ద ఎత్తున మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఈ ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి పట్ల వైసిపి నేతలు మొదటి నుంచి విషం చిమ్ముతున్నారని, వారి ఉద్దేశాలను చర్చల పేరుతో వారి తొత్తుల ద్వారా బహిర్గతం చేశారని ర్యాలీలో పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం

విజయనగరం: మానవహారం చేస్తున్న మహిళలు

నుంచి వినాయక టెంపుల్ నాలుగు రోడ్ల జంక్షన్ వరకు తెలుగు మహిళలు సాక్షి దినపత్రికను, ఛానల్‌ను బ్యాన్ చేయాలని మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. జర్నలిస్టులు వృత్తికి మచ్చ తెచ్చారని విమర్శించారు. సాక్షి దినపత్రికకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో పాతబగ్గాం సర్పంచ్ లెంక పద్మ, అరుణ, భవాని మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్: అమరావతి రాజధాని మహిళల శీల హననం గురించి సాక్షి టీవీలో మాట్లాడిన కారణంగా సాక్షి ఛానల్ ని, సాక్షి పత్రిక ను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం పైడితల్లి అమ్మవారి కోవెల నుండి కన్యకాపరమేశ్వరి కోవెల వరకు మహిళలు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం కన్యకాపరమేశ్వరి కోవెల వద్ద మహిళలు మానవహారం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ బాల్యవివాహాలు జరగకుండా అరికట్టాలని ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి అన్నారు. మంగళవారం గింజేరు గ్రామంలో జరిగిన కిషోర్ వికాసం వేసవి ముగింపు ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలోని కిషోర్ బాలికల గురించి తల్లులకు వివరించామన్నారు. విద్యావంతులను చేయడానికి బాల్య వివాహాలు నిర్మలించడానికి సమాజంలో చైతన్యం పెంపొందించడానికి తల్లిలు ప్రయత్నం చేయాలన్నారు. కౌమార ఆరోగ్యం రక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని కిషోర్ బాలికలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి ప్రతి విషయాన్ని తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఎంఎస్‌కె భాగ్యశ్రీ, ఎఎన్‌ఎం చంద్రకళ, విఒఎ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని కిశోర బాలికలను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజు కోరారు. పట్టణంలోని 16, 18 వార్డులలో మంగళవారం కిశోరీ వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలలో రక్తహీనత లోపం అధికంగా వస్తుందని నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతంగా ఉండగలరన్నారు. పిరియడ్స్ సమయంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంగన్వాడిలు, బాలికలు పాల్గొన్నారు.

కొత్తవలస: యుక్త వయసు బాలికలకి కిషోర్ వికాసం పై

గంట్యాడ: మాట్లాడుతున్న సిడిపిఒ

సరియైన అవగాహన ఉండాలని వియ్యంపేట ఐసిడిఎస్ పిఒ ఆర్.ఉమాదేవి అన్నారు. మంగళవారం వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల తుమ్మికాపల్లిలో స్త్రీ శిశు సంక్షేమ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా పంచాయతీ సర్పంచ్ విరోతి కొండలరావు అధ్యక్షతన బాలికలకి కిషోరీ వికాసంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోరీ వికాసం కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 2 తేదీ నుండి జూన్ 10 తేదీ వరకు యుక్త వయస్సు బాలికలకి 12 అంశాలపై బాలికలకి ఎదురయ్యే సమస్యలపై అవగాహనా, శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆడపిల్లల్ని ఎదగనిద్దాం, ఆడపిల్లల్ని చదవనిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ పి.కామేశ్వరి, ఏసిడిపిఒ బి.లక్ష్మి భాయ్, సూపర్ వైజర్ కె.రమణమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజ్‌కుమార్, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏఎన్ఎమ్ జ్యోతి, మహిళా పోలీస్ చిన్నమ్మలు, అంగన్వాడీ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని 6వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వీడియో చూపించి అవగాహన కల్పించారు. కిశోర వికాశం వేసవి కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషకాహారం సమతుల్య పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, ఎంఎస్కే సత్యవతి, అంగన్వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: బాల్య వివాహాలు అరికట్టాలని వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం గొలజాంలో కిషోర్ వికాస్ వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌమార బాలికలకు బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, విద్యా ఆవశ్యకతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బంగారు తల్లి, మహిళా పోలీస్ జైత్ర, ఏఎన్ఎం హైమావతి, అంగన్వాడి టీచర్లు, పద్మావతి, సూర్య కళ, కార్వేని తదితరులు పాల్గొన్నారు.

వంద పింఛన్లు మంజూరు

వేపాడ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వంద మందికి ఫౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. 2023-2024 సంవత్సర కాలంలో పింఛను పొందుతూ మరణించిన భర్త తాలూక పింఛను భార్యకు రావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నిబంధన మేరకు గతంలో వారికి ఇవ్వలేదన్నారు. ఈనెల 12వ తేదీన వీరికి మంజూరైన పింఛను ఇస్తామని ఈ విషయాన్ని పంచాయతీల ద్వారా లబ్ధిదారులకు సమాచారం ఇవ్వాలని కార్యదర్శులకు ఆయన సూచించారు.

హామీలు అమలు చేయాలి

బొబ్బిలిరూరల్: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు నేరవేర్చాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి విజయనగరం జిల్లా శాఖ కన్వీనర్ బి.జోగి నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి తను ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల వివిధ సబ్జెక్టులు చెందిన స్కూల్ అసిస్టెంట్లు 4వేలు, సుమారు 25 వేల ఎస్‌జిటి పోస్టులు రద్దయ్యాయన్నారు. 117 జిఒ వల్ల పిల్లలు తెలుగులో చదవడం రాయడం మర్చిపోయారన్నారు. అదే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం ప్రభుత్వ విద్యను ప్రైవేట్, కార్పొరేట్‌కు అప్పగించడమేనన్నారు.

ఐదుగురికి షైనింగ్ స్టార్ అవార్డులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయి. మంగళవారం ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయని, వీరంతా హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే లోకం నాగమాధవి చేతుల మీదుగా 20వేలు నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. వీరిలో సతివాడ మోడల్ స్కూల్‌కి చెందిన ఎస్.పవిత్ర, నెల్లిమర్ల జడ్‌పి గర్ల్స్ హై స్కూల్ పి.రాజేశ్వరి, కొండవెలగాడ జడ్‌పి హైస్కూల్ జె. జ్యోత్స్న, ఎంజెపి బిసి గురుకుల పాఠశాల కె.యశస్వి, ఎల్.మెహెర్ రేష్మ షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన కొండవెలగాడలో మంగళవారం షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న జ్యోత్స్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఇఒ వి.జ్ఞాన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: షైనింగ్ స్టార్ అవార్డులకు స్థానిక గ్లోబల్ వ్యూ ప్రైవేటు స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు

విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి

ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. 2024-25 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన కారణంగా ఒసి, ఎస్‌సి విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో వీరు ఎంపికైనట్లు తెలిపారు. గిరి సంపత్, సాత్విక్‌లు హోంమంత్రి అనిత చేతులు మీదుగా నగదు, అవార్డులు అందుకున్నారని అన్నారు. వీరిని మంగళవారం పాఠశాలలో కరస్పాండెంట్ చంద్రమోహన్, సిబ్బంది విద్యార్థులు అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 127 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో 40వేల మందికి పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కమిషనర్ మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్, చనిపోయిన అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు అయితే పర్మినెంట్ చేయాలన్నారు. దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి 20వేలకు

కమిషనర్‌కు వినతి పత్రాన్నిస్తున్న శంకరరావు, తదితరులు

పెంచాలని వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయని ఎడల ఏ క్షణానైనా సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి యుగంధర్, జి వెంకటేష్, శంకర్రావు, ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపు పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విద్యార్థుల కంటిచూపు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మంచు కుమార స్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న జ్ఞానోదయ పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన హాజరై పాఠశాలలోని విద్యార్థులకు, స్థానిక వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కాట్రాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. కంటి పరిరక్షణకు సంబంధించిన పోషక విలువలు కలిగిన మాత్రలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంచు కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు బహిరంగ ప్రదేశాలలో సైకిల్ పై తిరిగేటప్పుడు కళ్ళల్లో దుమ్ము పడి కళ్ళు నలిపి వేయడం వల్ల కళ్ళు సమస్యలు ఏర్పడతాయని, సెల్‌ఫోన్ ఎక్కువగా చూడటం వల్ల

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు కుమారస్వామి

కంటి సమస్యలు ఏర్పడతాయని, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం వల్ల కూడా విటమిన్స్ లోపం ఏర్పడి కంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు కనకల మురళీమోహన్, పాఠశాల కరస్పాండెంట్ మధు, స్వామి ఆసుపత్రి ఎఒ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు

డిపిఆర్ఒ రమేష్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

డిపిఆర్ఒగా, సమాచారశాఖ సహాయ సంచాలకులుగా సుదీర్ఘకాలం పనిచేసి, విశాఖపట్నం బదిలీ అయిన డి.రమేష్‌కు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఐపిఆర్ఒ ఎం.మల్లేశ్వరరావు, డివిజనల్ పిఆర్ఒ ఎస్.జానకమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ రమేష్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. రమేష్ హయాంలో జిల్లా సమాచార శాఖకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చిందని, ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎడి రమేష్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలంలో శాఖాపరంగా తన అనుభవాలను సిబ్బందితో పంచుకున్నారు. ప్రతి ఒక్కరి సహకారం వల్లే విజయవంతంగా విధులను నిర్వహించామని, ఇక్కడ చేసిన

రమేష్‌ను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు, సిబ్బంది

సేవలు సంతృప్తినిచ్చాయని అన్నారు. దీనికి సమష్టి కృషే కారణమని అన్నారు. కష్టపడి పనిచేస్తే ఎవరికైనా గుర్తింపు వస్తుందని చెప్పారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ రమేష్ ఈ సందర్భంగా పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఏడాది జైలు

కంటోన్మెంట్ : విజయనగరం మహిళా పోలీసు స్టేషనులో 2018లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో నిందితులు ముగ్గురికి ఏడాది జైలు, రూ.51వేలు జరిమానా విధిస్తూ విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి తీర్పు వెల్లడించారు. విజయనగరానికి చెందిన ప్రవీణ గోగులకు తమిళనాడు రాష్ట్రం పెరంబదూర్‌కు చెందిన పసుపులేటి జాషువతో 2017లో వివాహమైంది. అనంతరం భర్త జాషువ, అతని తల్లిదండ్రులు భాస్కరరావు, సుజాతలు అదనంగా మరో రూ.5లక్షలు కట్నంగా తీసుకురావాలని వేధింపులకు పాల్పడేవారని మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసారు. ప్రవీణ గోగుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పిఎస్ ఎస్ఐ ఎ.వెంకటరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసారని డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంటోన్మెంట్: నగరంలోని లీలామహల్ థియేటర్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని స్థానికులు జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసినా సమాచారాన్ని విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని జిల్లాకేంద్రాస్పత్రిలో ఉంచామని, వివరాలు తెలిసిన పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

యోగాతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- రేగిడి

యోగాతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని టిడిపి మండల నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్ కుమార్, ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు 1254 మంది యోగాలో పాల్గొని విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరరావు, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య, ఎపిఎం బాసిన గోవిందరావు, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ పాల్గొన్నారు.

సంతకవిటి: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపిడిఒ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం సంతకవిటిలోని విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నిత్యం యోగ చేసే వారికి రోగాలు దరిచేరవు అన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యం చేకూరి, జీవనశైలిలో మార్పు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గట్టి భాను, మండల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : మనిషి జీవనశైలి మార్పునకు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతో దోహదపడుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాబా మెట్ట దేవీ పార్కు వద్ద యోగాసనాల కార్యక్రమాలు జరిగాయి. యోగా శిక్షకులు అందరితోనూ యోగాసనాలు వేయించారు. అనంతరం యోగపట్ల ప్రజలకు మరింత చైతన్య పరిచేదిశగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాయితీతో వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం-2లో రాయితీ వరి విత్తనాలను మంగళవారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతులకు సకాలంలో రాయితీ విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉంచామని అన్నారు. ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ నిధులు పెట్టుబడి సాయంగా రైతన్నలకు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎటువంటి అపోహలకూ తావివ్వక ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని అన్ని హామీలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ, రైతు సేవాకేంద్రం, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT JUDGE Cum MACT AT SRIKAKULAM
M.V.O.P No: 207/2021

Between:-
Sri Kemburu Papinaidu ....Petitioner
And:-
Sri Kalisetti Satyam @ Satyanarayana and others ....Respondents

To,
R1: Sri Kalisetti Satyam @ Satyanarayana, Son of late Ramunaidu, aged 66 years, Driver of lorry, residing at Garividi village and mandal.

NOTICE

It is to inform you that the above matter stands posted to on **27-06-2025** for your appearance.Hence you have to appear before the Honourable court on **27-06-2025 at about 10.30 AM.,** as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court//

M. ANNAM NAIDU
ADVOCATE,
SRIKAKULAM, CELL: 94416 19887.